క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

మేలమర్రు(మోపిదేవి): మండల పరిధిలోని మేలమర్రు దళితవాడలో అవనిగడ్డ శ్రీరామ వెల్ఫేర్ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు శనివారం 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇమాన్యుయేల్ చర్చి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కిషోర్ నాయుడు పేద ప్రజలకు దుప్పట్లు అందజేశారు.

ట్రెజరీ ఉద్యోగి గుండెపోటుతో మృతి

అవనిగడ్డ: స్థానిక ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సైకం రాణాప్రతాప్(48) గుండెపోటుతో మరణించారు. శుక్రవారం అర్ధరాత్రి రాణాప్రతాప్‌కు గుండెపోటు రావడంతో చికిత్స కోసం మచిలీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. ఆయన భార్య బీసీ వసతి గృహంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ డీసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు రాణాప్రతాప్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బందరు విచ్చేసిన పగడాల ఆనందతీర్థాచార్యులు



మచిలీపట్నంటౌన్: తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్టు విశేషాధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు శనివారం మచిలీపట్నంలోని దత్తాశ్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై కోలాట భజనలతో, మంగళ హారతులతో, పూలు చల్లుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. దత్తాశ్రమంలోని ఉపాలయాలను ఆయన దర్శించి పూజించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు 9 వరకే గడువు

పెడన: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరుగా నమోదు చేయడానికి, మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఈ నెల 9వ తేదీతో గడువు ముగుస్తుందని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పెడన మండల వ్యాప్తంగా పట్టభద్రులుగా నమోదైన ఓటర్లు పురుషులు 741, మహిళలు 509 మంది నమోదయ్యారని, మొత్తం 1,250 మంది నమోదయ్యారన్నారు. అర్హులుంటే 9వ తేదీ లోగా నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో శ్రీ వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఉదయం ప్రధాన మూర్తులకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. పండితుడు వీరుభొట్ల సత్యన్నారాయణ శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ దేవానంద్ తెలిపారు. చినపాండ్రాక కాలువ కట్టపై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో పండితుడు జ్యోశ్యుల ప్రసాదు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో కొలువై ఉన్న నాగేశ్వరస్వామి మందిరాల వద్ద భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామివారి షష్ఠి ఉత్సవాలు మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకొన్నారు. గరిశపూడిలోని సుబ్రమణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద వేకువజామునుండే భక్తులు బారులు తీరి పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. నీలిపూడి, మాట్లాం, లక్ష్మీపురం, పల్లెపాలెం, చినగొల్లపాలెం తదితర గ్రామాలలో షష్ఠి వేడుకలు జరిగాయి.



బంటుమిల్లి మండలం జానకీరామపురంలో సుబ్రహ్మణ్య షష్ఠి కల్యాణం చేస్తున్న దంపతులు

నాగాయలంకలో...

నాగాయలంక: సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త శిష్ఠా విశాలాక్షి పర్యవేక్షణలో తొలుత అర్చకుడు అడపా సాయి విష్ణు నరసింహశాస్త్రి అర్చకత్వంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నాగ పుట్టలలో పాలు పోసిన భక్తులు పూజలతో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఔత్సాహిక యువత ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సౌజన్యంతో రెండు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. శ్రీరామపాదక్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, వాడపల్లి నాగేశ్వరరావు తదితరులు స్వామి కల్యాణం తిలకించి పల్లకీ సేవలో పాల్గొన్నారు.



కృత్తివెన్ను మండలం మాట్లాం వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

ఘంటసాలలో...

ఘంటసాల: ఘంటసాలలో శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం షష్ఠి మహోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు పుట్టలో పాలు పోసి పండ్లు, పుష్పాలతో అలంకరించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన తాళం భజన, మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఘంటసాలకు చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి వారు సేవా కార్యక్రమాలను అందించారు. శుక్రవారం రాత్రి శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘంటసాల రాధాకృష్ణమూర్తి – విజయలక్ష్మి దంపతులతో అంగరంగ వైభవంగా జరిగింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి కొల్లు

మచిలీపట్నంటౌన్: ఆపదలో ఉన్న వారికి అనుక్షణం అండగా ఉంటానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రి కొల్లు తన నివాసంలో శనివారం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న జన్ను నారాయణమ్మకు రూ.40 వేలు, తుమ్మల సత్యనారాయణకు రూ.57 వేలు, హాలీ మున్నీసాకు రూ.1.50 లక్షలు, షేక్ మున్వర్‌కు రూ.30 వేలు, మిస్కిన్‌కు రూ.42 వేలు, విక్కుర్తి సాయిబాబుకు రూ.92 వేలు, నర్గీష్ ఫాతిమాకు రూ.30 వేలు, చిత్తజల్లు రాజశేఖర్‌రావుకు రూ.1.58 లక్షలు, తమటం శ్రావణికి రూ.37 వేలు, పెడిరింగ ధనెమ్మకు రూ.60 వేలు, జడ్డు వెంకటేశ్వరరావుకు రూ.30 వేలు, విశ్వనాథపతి రోహిత్‌కు రూ.60 వేలు, శ్రీరాం



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

నాగబాబుకు రూ.1.66 లక్షలు, గౌర సుబ్బలక్ష్మికి రూ.51 వేలు, మద్దుల లక్ష్మికి రూ.1.08 లక్షలు, ఎం.జహీరుద్దీన్‌కు రూ.37 వేలు, కొల్లు చిన్నికి రూ.82 వేలు, గోశాల నాగబాబుకు రూ.లక్ష, బొప్పనమ్మకు రూ.37 వేలు చొప్పున చెక్కులను అందజేశారు.

పృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి పేర్ని

చల్లపల్లి(అవనిగడ్డ): మండల పరిధిలోని నడకుదురులో ఉన్న పృథ్వీశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. పేర్ని నాని, ఆయన తనయుడు మచిలీపట్నం వైఎస్సార్ సీపీ కన్వీనర్ పేర్ని కిట్టులకు నడకుదురు సర్పంచ్ గౌరిపర్తి సురేష్ స్వాగతం పలికారు. అనంతరం నాని కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని, కిట్టు

ఆర్ఎస్‌కేల ద్వారానే ధాన్యం తరలించాలి

మల్లంపల్లి(ఘంటసాల): రైతు సేవా కేంద్రాల ద్వారానే రైతులు ధాన్యం తరలించాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మల్లంపల్లి గ్రామంలో ధాన్యం తరలించే కార్యక్రమాన్ని తహసీల్దార్ శనివారం పరిశీలించారు.

ముత్యాలమ్మ ఘటం ఊరేగింపు

పెడన: పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో శనివారం ముత్యాలమ్మ ఘటం ఊరేగింపు జరిగింది. ఈ నెల 2న రంగుల కోసం మచిలీపట్నం వెళ్లిన పైడమ్మ అమ్మవారు తిరిగి ఈ నెల 14వ తేదీ గ్రామానికి తిరిగి వస్తారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు దామెర్ల గాయత్రి, సిద్ధినేని అశోక్‌నాయుడు రూ.10 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. శనివారం దీనిని హెచ్ఎం రాజనాల నీరజకు అందించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

ఘంటసాల: ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం లోగా తెలియజేయాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు.

9లోగా ఓటు నమోదు చేయించుకోవాలి

మోపిదేవి: ఈ నెల 9వ తేదీ లోగా పట్టభద్రులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. మండలంలోని కొక్కిలిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తదుపరి కృష్ణానది సమీపంలోని బొబ్బర్లంక, కె.కొత్తపాలెం గ్రామాల్లో అక్రమ ఇసుక తరలింపుపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

చిట్టిపాలెంలో శాస్త్రవేత్తల బృందం పర్యటన

కోనేరుసెంటర్: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం శనివారం బందరు మండలంలోని చిట్టిపాలెం గ్రామంలో వరి రకం యం.సి.యం–103 ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం సందర్శించారు. సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి, సస్యపోషణ శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి వరి రకం యం.సి.యం–103 పై రైతుల అభిప్రాయాలు సేకరించారు.

వ్యర్థాలను తొలగించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రావివారిపాలెం(మోపిదేవి): జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కేవీకే ఘంటసాల వారి ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రావివారిపాలెంలోని గ్రామ సచివాలయం నుంచి ఆర్ఎస్‌కే వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించి శుభ్రపరిచారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యన్ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మండల పూజలో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు

సంక్షిప్త వార్తలు

డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) నేతృత్వంలో కొల్లూరి అన్నదమ్ములు, కొల్లూరి ఆడపడుచులు ఈ ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

నాచుగుంట పాఠశాల భవనం పూర్తిచేయాలి

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. మండల ప్రత్యేకాధికారి డీసీఎంఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.నిత్యానందం, ఎంఈవో–1, 2లు వి.త్రిపురసుందరి, వెంకటేశ్వరరావు మండలంలో పర్యటించి సమావేశాలను పర్యవేక్షించారు. అర్తమూరు పంచాయతీ శివారు నాచుగుంట దళిత వాడలో పునఃనిర్మాణం ప్రారంభమై మధ్యలో ఆగిపోయిన పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని తల్లిదండ్రులు ప్రత్యేకాధికారికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రత్యేక అధికారి నిత్యానందం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పలు చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరొక ఉపాధ్యాయుడిని నియమించాలని, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశాలలో ఎంపీపీ వెలివెల చినబాబు, టీడీపీ నాయకుడు అంగర రంగనాథ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

ఘంటసాల: పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అన్నారు. ఘంటసాల పెద్దగూడెంలోని ఎంపీపీ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. చిట్టూర్పు ఎంపీపీ స్కూల్, శ్రీకాకుళం, గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూళ్లు, ఘంటసాలపాలెం సీబీసీఎన్‌సీ స్కూళ్లలో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు.

విద్యార్థుల నడవడికను గమనించాలి

కోడూరు: విద్యార్థుల నడవడికలను, ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించి, వారి విద్యా పురోగతిపై పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని ఎస్ఐ చాణిక్య అన్నారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో శనివారం జరిగిన ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. తల్లులకు రంగవల్లుల పోటీలు జరిపి విజేతలకు జ్ఞాపికలు అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, హెచ్ఎం ఆలా వెంకటరమణ, వివిధ రాజకీయ పార్టీల నేతల పాల్గొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను వేడుకగా జరిపారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు జరిపి, బహుమతులు అందించారు.

కృత్తివెన్నులో తల్లిదండ్రుల సమావేశాలు

కృత్తివెన్ను: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందించారు. అనంతరం వారంతా కలసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఎంఈవో ఎస్ కేడీవీ ప్రసాద్, సర్పంచ్ ప్రభుప్రసాద్, పాఠశాల అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

భారీ విరాళ దాతకు ఘన సన్మానం

కోడూరు: మండలంలోని రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలకు భారీ మొత్తంలో విరాళం అందించిన మెగా డోనర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను జెడ్పీ పాఠశాలకు తీర్చిదిద్దేందుకు స్థల సేకరణ అవసరం కాగా, ఆ స్థలం కొనుగోలుకు కోనసీమ జిల్లాకు చెందిన నడింపల్లి చినవెంకటరాజు (శివ) రూ.3.20 లక్షల నగదును విరాళంగా అందించారు. చినవెంకటరాజును శనివారం ఉపాధ్యాయ బృందం దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, హెచ్ఎం నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సహకరించాలి

మోపిదేవి: విద్యార్థుల క్రమశిక్షణను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకుని ఉపాధ్యాయులకు సహకరించాలని ఎంపీపీ రావి దుర్గావాణి సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నాగబాబు, పూర్వవిద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభదిన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

51 మంది రక్తదానం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 51 మంది రక్తదానం చేశారు. అవనిగడ్డ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేశారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

గుడివాడ టౌన్: జర్మనీ దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ కృష్ణా జిల్లా అధికారి పి.నరేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జనరల్ నర్సింగ్, మిడ్వైఫరి (జీఎన్ఎం), బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. బీఎస్సీ అభ్యర్థులు రెండేళ్లు, జీఎన్ఎం అభ్యర్థులు మూడేళ్ల అనుభవంతో 35 ఏళ్లలోపు వయస్సు కల్గి ఉండాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 12వ తేదీ నుంచి గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో జర్మనీ భాషపై ఆరునెలలు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గల వారు హాజరుకావాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 89190 23266, 99895 19495 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీజ్ చేసిన రేషన్ బియ్యం మాయం

రేషన్ డీలరు, ఎండీయూ ఆపరేటర్‌పై కేసు

కంకిపాడు: సీజ్ చేసిన రేషన్ బియ్యం మాయమైన ఘటనకు సంబంధించి రేషన్ డీలరు, ఎండీయూ ఆపరేటర్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం కేసు నమోదు చేశారు. కంకిపాడు పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులో ఉన్న రేషన్ దుకాణాన్ని శుక్రవారం రాత్రి పౌర సరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో దుకాణంలో సీజ్ చేసి ఉంచిన 41.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం లేకపోవటం, స్టాకు నిల్వలో వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించారు. ఎండీయూ ఆపరేటర్ వద్ద ఉండాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణంలో ఉన్నట్లు చూపారు. సీజ్ చేసిన బియ్యం లేకపోవటంపై డీలరు హరిప్రసాద్ పైనా, ఎండీయూ ఆపరేటర్ వద్ద ఉండాల్సిన బియ్యాన్ని రేషన్ దుకాణంలో ఉంచినందుకు ఆపరేటర్ పవన్‌పైనా 6ఏ కేసు నమోదు చేశారు. శనివారం డెప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ విలేకరులతో మాట్లాడుతూ డీలర్, ఎండీయూ ఆపరేటపర్‌పై కేసు నమోదు చేశామని, జేసీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

వీనుల విందుగా సంగీత నీరాజనం



కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో కీర్తనలు ఆలపిస్తున్న విద్వాంసులు

విజయవాడ కల్చరల్: కేంద్ర సంగీత నాటక అకాడమీ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ, ఆంధ్రప్రదేశ్ టూరిజం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో నిర్వహిస్తున్న సీజన్ టూ కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం రెండో రోజు శనివారం కొనసాగింది. కృష్ణానది సమీపంలో దుర్గాఘాట్ ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మల్లాది బ్రదర్స్ ఆధ్వర్యంలో సంగీత సద్గురువు త్యాగరాజ స్వామి రచించిన పంచరత్న కీర్తనలు జగదానంద కారక, దుడుకుగల, సాధించెనే ఓ మనసా, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు తదితరాలను మధురంగా ఆలపించడంతో కృష్ణవేణమ్మ పులకించింది. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.ఎస్.రామరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సద్గురువుల సేవలో..

ప్రధాన ఆడిటోరియంలోని కళాక్షేత్రంలో సద్గురువుల కీర్తనలను ఎన్‌సీహెచ్ పార్థసారథి ఆలపించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శేషులత బృందం ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలతో అలరించారు. డాక్టర్ వి.బాలసుబ్రహ్మణ్యం శాస్త్రీయ సంగీతం నేటి కాలానికి అవసరం అన్న అంశంగా ప్రసంగించారు. శ్యామశాస్త్రి కీర్తనలను చెన్నయ్‌కు చెందిన దీపిక, నందిక, బెంగళూకు చెందిన వినయ్, మోదుమూడి సుధాకర్, హైదరాబాద్ సోదరులు డాక్టర్ డి.రాఘవాచారి, డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ, ఆకురాతి కోదండ రామయ్య గాత్ర సంగీత కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వాంసుడు ఎస్.ఎం.సుభానీ నిర్వహించిన మాండలిన్ కచేరీ అలరించింది. హరికథా గానంలో భాగంగా తిరుపతికి చెందిన జయంతి సావిత్రి హరికథా గానం చేశారు.



హరికథా గానం చేస్తున్న జయంతి సావిత్రి

రాజస్థాన్, ఉత్తరాఖండ్ ముందంజ

విజయవాడస్పోర్ట్స్: విజయ్‌మర్చంట్ అండర్–16 బాలుర మల్టీడే క్రికెట్ టోర్నీలో రాజస్థాన్, ఉత్తరాఖండ్ జట్లు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) మైదానాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ప్రత్యర్థి జట్లను ఆశించిన స్థాయిలోనే కట్టడి చేశాయి. రాజస్థాన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌ను 92 ఓవర్లకు నాలుగు వికెట్ల నష్టానికి 632 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం డీవీఆర్ మైదానంలో బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 91 ఓవర్లకు ఒక వికెట్ నష్టపోయి 229 పరుగులు చేసింది. ఓపెనర్ టాహిడ్ 294 బంతులకు అజేయంగా 114 (16ఫోర్లు, 4 సిక్స్‌లు) చేశాడు. సీపీ మైదానంలో ఉత్తరాఖండ్–జమ్ముకశ్మీర్ జట్లు తలపడుతున్నాయి. ఉత్తరాఖండ్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌ను 111 ఓవర్లకు తొమ్మిది వికెట్లు నష్టపోయి 509 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జమ్ము కాశ్మీర్ జట్టును 64.2 ఓవర్లకు 217 పరుగుల వద్ద ఉత్తరాఖండ్ బౌలర్లు కట్టడిచేశారు. ఉత్తరాఖండ్ బౌలర్ ప్రియాన్షుసింగ్ నాలుగు కీలక వికెట్లు తీశాడు.



114 రన్స్ చేసిన టాహిడ్



నాలుగు వికెట్లు తీసిన ప్రియాన్షుసింగ్

పురుగు మందు తాగి యువతి మృతి

మైలవరం: జి.కొండూరు మండలం చేగిరెడ్డిపాడు గ్రామంలో పురుగు మందు తాగి యువతి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన గొర్ల గోపాలరావు, నాగమణి దంపతులు జి.కొండూరు మండలం చేగిరెడ్డిపాడు గ్రామంలోని మామిడి తోటలో కాపలాదారుగా పనిచేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె భాగ్యలక్ష్మి (17) ఉన్నారు. నాలుగు నెలలుగా భాగ్యలక్ష్మి మానసికంగా బాధపడుతోంది. ఆరోగ్యం సరిగా ఉండటంలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి యువతి విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. నొప్పిని తాళలేక పురుగు మందు తాగింది. ఆమెను గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సద్భావనతో వేసే ప్రతి అడుగు బంగారు భవిష్యత్తుకు పునాదే

జిల్లా ఎస్పీ గంగాధరరావు



కోనేరుసెంటర్: విద్యార్థులు మంచి ఆలోచనతో వేసే ప్రతి అడుగు భవిష్యత్తులో బంగారు బాటకు పునాది అవుతుందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. మచిలీపట్నంలోని జైహింద్ హైస్కూలులో శనివారం జరిగిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తన జీవితంలో మొదటిసారి ఉపాధ్యాయునిగా ప్రభుత్వ ఉద్యోగంలో అడుగుపెట్టానని, తర్వాత లెక్చరర్, ఆ తరువాత పోలీస్ అధికారిగా స్థిరపడినట్లు చెప్పారు. తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగిందన్నారు. విద్యార్థులు చెడు సావాసాలు, చెడు వ్యసనాల జోలికి వెళ్ల కూడదన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల తదితరులు

మచిలీపట్నంటౌన్: త్వరలో ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక రుస్తుంబాద బాలికల మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లులకు ముగ్గులు, తండ్రులకు తాడు లాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రుస్తుంబాద హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయడంతో పాటు డ్రాప్ అవుట్స్ నివారణకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతున్నట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలోనే ఈగల్ ఫోర్స్ టీమ్‌లను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇన్నోవేషన్స్ కోసం మచిలీపట్నం నేషనల్ కాలేజీలో త్వరలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 2025 జనవరి 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో యువకెరటాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులతో తమ పిల్లలను ప్రతిరోజు బడికి పంపుతామని, వారి విద్యా, మానసిక, నైతిక వికాసానికి చేయూతనిస్తామని మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ వారానికోసారైనా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని సూచించగా, డీఈవో వెంటనే స్పందించి సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో తరగతి చొప్పున విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను ఆదేశించారు. మహిళా పోలీస్ హేమలత సైబర్ నేరాల గురించి విద్యార్థినులకు వివరించారు. ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థిని బి.పద్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ గీతాబాయి, జనసేన, బీజేపీ నాయకులు బండి రామకృష్ణ, సోడిశెట్టి బాలాజీ, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి, ఎంఈఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమన్వయానికి దోహదం చేసే పేరెంట్స్ సమావేశాలు

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ సంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయానికి ఆత్మీయ సమావేశాలు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమావేశం కావడం వల్ల విద్యార్థి లోపాలను సమీక్షించుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. డీఎస్‌ఓ వి.పార్వతి, సర్పంచి లింగం సులోచనారాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పోతన కృష్ణారావు, హెచ్ఎం డి.పుష్పలత, ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యల ఏకరవు

- పలు పాఠశాలల్లో సమస్యలను ప్రస్తావించిన తల్లిదండ్రులు
- పరిష్కరించడానికే సమావేశాలన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పెడన మండలం పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌లో రంగవల్లులను పరిశీలిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: కూటమి ప్రభుత్వం సర్కారీ బడుల్లో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లలో ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. మండల పరిధిలోని పెనుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హాజరయ్యారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షెడ్యూల్ ప్రకారం ఆటల పోటీలు పెట్టాల్సి ఉండగా నేరుగా సభను ఏర్పాటు చేశారు. పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లు అధిక సంఖ్యలో వేసుకునివస్తారని, సైకిల్ షెడ్డు నిర్మించాలని చాలా మంది డిమాండ్ చేశారు. పదో తరగతి మినహా మిగిలిన తరగతుల విద్యార్థులంతా కింద కూర్చోవాల్సి వస్తోందని, డ్యూయెల్ డెస్కులు ఇప్పించాలని కోరారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలంలో నాడు నేడు కింద మంజూరు అయి అసంపూర్తిగా నిలిచిన భవనాలను పూర్తిచేయాలని బల్లిపర్రు ప్రాథమిక పాఠశాలలో, అదనపు తరగతి గదుల గురించి తోటమూల భట్ట మోహనరావు, హైమవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశ్నించారు. తోటమూలలో దాతల సాయం కావాలని అర్థించారు. రేకుల షెడ్డు నిర్మాణానికి స్థలదాత కుమారుడు ముందుకు వచ్చారు.

ఎందరో నిష్ణాతలను అందించిన వందేళ్ల హైస్కూల్



పలు పోటీల్లో విజేతలతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఉపాధ్యాయులు

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్లలో ఎందరో నిష్ణాతలను అందించిందని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. హైస్కూల్ ఆవరణలో శనివారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం జరిగింది. ప్రముఖ అణుశాస్త్రవేత్త మైనేని హరిప్రసాద్, సినీనటుడు కోట శ్రీనివాసరావు, ప్రముఖ గాయకుడు ఎల్వీ గంగాధరశాస్త్రి, ప్రముఖ అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఇదే పాఠశాలలో చదువుకున్నారని చెప్పారు. ఈ హైస్కూల్‌లో చదువుకున్న తాను, తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు, సింహాద్రి సత్యనారాయణ, అంబటి రాంబాబు మంత్రులుగా పనిచేశామన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. యువనేత మండలి వెంకట్రామ్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియాదేవి, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, ఎంఈవోలు ఎస్.శివశంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య పాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నాగాయలంకలో ...

నాగాయలంక: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌లు జరిగాయి. స్థానిక మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కొల్లూరి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, సర్పంచి కైతేపల్లి అంకాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్ఎంసీ చైర్మన్ సుదర్శన్‌బాబు, వైస్ చైర్‌పర్సన్ రేణుకాదేవి విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ–1 టీవీఎం రామదాసు, ఎంఈఓ–2 ఎ.రామారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.శివరామకృష్ణ తదితరులు మాట్లాడుతూ పిల్లల బంగారు భవితకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. వక్కపట్లవారిపాలెం, భావదేవరపల్లి, చోడవరం పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్‌లు జరిగాయి.